సాక్షి కుమురం భీం

సోమవారం। 2 । జనవరి । 2023



మురుగుతో పరేషాన్

వాంకిడి మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలో కాంట్రాక్టర్ ఇష్టారీతిన డ్రైయినేజీలు నిర్మించడంతో మురుగునీరు నిలిచి ఉంటోంది. 9లో▸



నాగోబా జాతరకు మరో అడుగు

నాగోబా మహాజాతర నిర్వహణకు మరో అడుగు పడింది. ఉమ్మడి జిల్లా కు చెందిన మెస్రం వంశీయులు ఆదివారం కేస్లాపూర్‌లో మరోసారి సమావేశమయ్యారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.1 /15.7

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి చలి తీవ్రత కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: శాంతి భద్రతల దృష్ట్యా డిసెంబర్ 31 నుంచి ఈనెల 3 వరకు జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ కె.సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి లేదా పోలీసు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎలాంటి పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించవద్దన్నారు. జిల్లాలో ప్రశాంతతను పెంపొందించేందుకు పోలీసు అధికారులకు సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులు అవుతారన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

కాగజ్‌నగర్‌టౌన్: నియోజకవర్గంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని గుంటూరు కాలనీలో గల ఆయన నివాసంలో పీఆర్టీయూ తెలంగాణ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మధుకర్, రాష్ట్ర కార్యదర్శి తిరుపతయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు పర్వతి రాజేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ప్రతినిధులు చంద్రశేఖర్, నాగరాణి, స్వామి, పల్లవి, వెంకటరమణ, శ్రీనివాస్, రహీం, ఉమేశ్, తదితరులు పాల్గొన్నారు.


గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించాలి



గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న గోవింద్‌నాయక్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ భుక్యా గవర్నర్ తమిళిసైని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైని కలిసి జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జిల్లాలో షెడ్యూల్ 5, జీఓ ఎంఎస్ 93 సోషల్ వెల్ఫేర్ (వి) 1986ని, జీఓఎంఎస్ 3857, 2015, ఈఎఫ్ఎస్, టి 2017లను రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల రోస్టర్ రిజిస్టర్‌ను అమలుచేయడంలేదన్నారు. పోరాట యోధుడు కుమురం భీం పుట్టినగడ్డ అయిన జిల్లాలో ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన గవర్నర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక పంపించి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

జిల్లా జడ్జీని కలిసిన న్యాయవాదులు



క్యాలెండర్ అందజేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీష్‌బాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా మూడో అదనపు జడ్జి నారాయణబాబు, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి క్యాలెండర్, డైరీ, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తాటిపల్లి సురేశ్, జగన్మోహన్‌రావ్, దీపక్, రవీందర్, రాజీవ్‌రెడ్డి, అగర్వాల్, రాజ్‌కుమార్, చంద్రకుమార్, శ్యాం, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో హ్యాండ్‌వాష్!

జిల్లా కేంద్రంలోని జీసీడీవో కార్యాలయంలో యంత్రాలు





గిరిజన పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకుంటున్న ప్రిన్సిపాల్

- విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం
- చేతుల శుభ్రంతో వ్యాధులు దూరం
- మన ఆరోగ్యం మన చేతుల్లో..

ఆసిఫాబాద్‌రూరల్: ఆరోగ్యమే మహాభాగ్యం.. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవడంతో చాలా రోగాలు దరి చేరకుండా ఉంటాయని కరోనా సమయంలో ప్రజలంతా చేతుల శుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇటీవల జిల్లాలోని వసతిగృహాల్లో వివిధ కారణాలతో నలుగురు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం గిరిజన ఆశ్రమాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంకోసం 'సబ్బుతో చేతులు కడుగుదాం.. జబ్బులకు దూరంగా ఉందాం' అనే ఉద్దేశంతో యూనిసెఫ్(యూనైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్ ఎమర్జెన్సీ ఫండ్) కేర్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని 15 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఒక్కో విద్యాలయానికి రెండు చొప్పున చేతులు శుభ్రం చేసుకునే యంత్రాలు బిగించనున్నారు.

వ్యాధులకు దూరంగా విద్యార్థులు

వసతిగృహాలు, పాఠశాలల్లో భోజన సమయంలో విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు సబ్బులు అందుబాటులో ఉంచాల్సి ఉన్నా జిల్లాలో ఎక్కడా కనిపించడంలేదు. దీంతో చేతిపంపుల వద్ద ఉన్న మట్టితోనే విద్యార్థులు చేతులు, ప్లేట్లను శుభ్రం చేసుకుంటున్నారు. దీంతో డయేరియా, జలుబు, టైఫాయిడ్, కామెర్లు, దగ్గు, న్యుమోనియా, చర్మవ్యాధులు.. ఇలా అనేక రోగాలు దరిచేరే ప్రమాదం ఉంది. చేతులు శుభ్రం చేసుకోవడంతో 80 శాతం రోగాలు దూరం అవుతాయని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. గతంలో వసతిగృహాల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కొరవడడం, వైద్యసేవలు అంతంత మాత్రంగానే ఉండడం, మాతాశిశు మరణాలు ఎక్కువగా నమోదు కావడం, తదితర గణాంకాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. దీంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో చేతులు శుభ్రం చేసుకునే యంత్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఒక్కో యంత్రానికి రూ.25 వేలు వెచ్చించి జిల్లాకు మొదటి విడతలో 15 యంత్రాలు మంజూరు చేసింది.

మొదటి విడతగా 15 ఆశ్రమాల్లో

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 46 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. మొదటి విడతలో భాగంగా ప్రభుత్వం 15 ఆశ్రమ పాఠశాలలను ఎంపిక చేసింది. ఒక్కో పాఠశాలకు రెండేసి యంత్రాల చొప్పున అమరుస్తున్నారు. ఒక్కో యంత్రానికి రూ.25 వేలు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్‌లో బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాల, గిరిజన బాలికల పాఠశాల, కళాశాల, వాంకిడిలో బా లికల ఆశ్రమ పాఠశాల(1), కెరమెరిలో బాలుర, బా లికల(మోడి) పాఠశాలలు, జైనూర్ మండలంలో మహాగాం, రాశిమెట్ట, పట్నాపూర్, కోహినూర్ బాలి కల ఆశ్రమాలు, బెజ్జూరులో 1, సిర్పూర్ (టీ)లో 1, తిర్యాణి మండలంలోని చెలిమెల, గిన్నెదరి ఆశ్రమ పాఠశాలల్లో చేతులు శుభ్రం చేసుకునే యంత్రాలు అమరుస్తున్నారు. ఇటీవల కొత్తరకం వేరియంట్ వస్తున్న నేపథ్యంలో ఇలాంటి యంత్రాలు విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడనున్నాయి.

విద్యార్థులకు ఎంతో మేలు



జిల్లాలో 46 ఆశ్రమ పాఠశాలలు ఉండగా మొదటి విడతలో ప్రభుత్వం చేతులు శుభ్రం చేసుకునే యంత్రాలను 15 మంజూరు చేసింది. ఆయా పాఠశాలల్లో వాటిని బిగిస్తున్నారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడంతో బాక్టీరియా, అంటువ్యాధులు రాకుండా యంత్రాలు ఉపయోగపడనున్నాయి. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు చూడాల్సిన అవసరం ఉంది.

– మణెమ్మ, డీటీడీవో

వ్యాధుల నుంచి రక్షణ...



ఆశ్రమ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను వ్యాధుల నుంచి రక్షించేందుకు చేతులు శుభ్రం చేసుకునే యంత్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయి. సుమారు 80 శాతం వరకు వ్యాధులు విద్యార్థుల దరిచేరవు. విద్యార్థులు ప్రతిరోజు భోజనం చేసేముందు చేతులను శుభ్రంగా కడుక్కుని వ్యాధుల నుంచి రక్షించుకోవాలి.

– ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో

అంబరాన్నంటిన న్యూఇయర్ సంబరాలు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్

ఆసిఫాబాద్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. నూతన సంవత్సరానికి స్వాగతం తెలుపుతూ ఉదయం నుంచే మహిళలు ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు వేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప లు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జె డ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో పాటు బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023 సంవత్సరంలో జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మండలంలోని కుమురంభీమ్ ప్రాజెక్టు వద్ద పర్యాటకులతో సందడిగా మారింది.



ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు స్వీటు తినిపిస్తున్న నాయకులు

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: కుల సంఘాలు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో ఆ సంఘం 2023 సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం భవన అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రూ.10 లక్షలు, ఎమ్మెల్సీ రూ. 5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల సంఘం ఐక్యతగా ఉంటేనే ప్రజలందరు అభివృద్ధి సాధించవచ్చన్నారు. పేద కుటుంబాలకు సాయం చేసి మరింత ముందుకెళ్లాలని సూచించారు. అంతకుముందు వారిని సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గంలోని మున్నూరు కాపు కుల పెద్దలు పాల్గొన్నారు.

బాల్యం మోములో చిరునవ్వు కోసం..



- ప్రారంభమైన ఏడో విడత ఆపరేషన్ స్మైల్
- బాల్యం విముక్తికి రెండు బృందాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

'ఆపరేషన్ స్మైల్'లో విముక్తి కలిగిన చిన్నారులు

ఏడాది	బాలురు	బాలికలు	మొత్తం
2017	58	09	67
2018	40	07	47
2019	48	17	65
2020	100	06	106
2021	139	15	154
2022	92	09	101

పెంచికల్‌పేట్: చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపి బందీలుగా ఉన్న బాల్యాన్ని విముక్తి చేసేందుకు ప్రభుత్వం ఏటా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరిట రెండు సార్లు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బందీలుగా ఉన్న బాలబాలికలకు విముక్తి కల్పిస్తోంది. ఏటా జనవరి 1 నుంచి 31 వరకు ముప్పై రోజులు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో జిల్లాలోని హోటళ్లు, మెకానిక్ దుకాణాలు, ఇటుకబట్టీల్లో తనిఖీలు నిర్వహించటానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే కార్యక్రమం నిర్వహణపై జిల్లా స్థాయిలో అధికారులకు శిక్షణ సైతం ఇప్పించారు. 2017 నుంచి 2022 వరకు ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలు పదిసార్లు నిర్వహించిన అధికారులు 803 మందికి విముక్తి కల్పించారు. వీరిలో 709 మంది బాలురు, 94 మంది బాలికలు ఉన్నారు.

జిల్లాలో ఇలా ...

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కలెక్టర్ నేతృత్వంలో పోలీసు అధికారులు, శిశు సంరక్షణ, కార్మిక, బాలల హక్కుల పరిరక్షణ సమితి, విద్యాశాఖ సమన్వయంతో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలో బందీలుగా ఉన్న బాలలను గుర్తించటానికి రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాల్లో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, పోలీసు అధికారి, ఇద్దరు కానిస్టేబుళ్ళు, ఒక మహిళా కానిస్టేబుల్, కార్మిక శాఖ నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. వీరు తప్పిపోయిన పిల్లలు, అనాథ, వీధి బాలలను గుర్తిస్తారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లు, దాబాలు, మిల్లులు, ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న పిల్లలను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగిస్తారు. అనాథ బాలికలకు జిల్లా కేంద్రంల్లోని వసతి గృహాలకు తరలించి వారికి చదువు, విద్య, వైద్యం, భోజన వసతి సౌకర్యం కల్పిస్తారు.

బాలలతో పనులు చేయిస్తే చర్యలు



రాజ్యాంగం బాలలకు హక్కులు కల్పించింది. వాటికి భంగం కలిగించి వారిని పనిలో పెట్టుకుని వెట్టిచాకిరీ చేయిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తాం. 14ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారికి ఉచిత నిర్బంద విద్య అందించాల్సిన అవసరం ఉంది.

– బి.మహేష్, బాలల సంరక్షణ అధికారి, ఆసిఫాబాద్

ఎట్టకేలకు స్వయం ఉపాధి రుణాలు

మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లాలో కొన్నేళ్లుగా మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు రుణాల ఊసేలేకుండా పోయింది. దీంతో నిరుద్యోగ యువతకు ఎదురుచూపులు తప్పలేదు. ఎట్టకేలకు ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై రుణాలు అందించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

- మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాకు 56 యూనిట్ల కేటాయింపు
- జనవరి 5 వరకు దరఖాస్తు గడువు

కౌటాల(సిర్పూర్): మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు ప్రభుత్వం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అల్ప సంఖ్యాక వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉపక్రమించింది. మైనార్టీలకు రుణాలు అందజేసేందుకు పచ్చజెండా ఊపింది. నిరుద్యోగ యువత ఐదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. అర్హులైన నిరుద్యోగులు వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకు లింకేజీ, నాన్ లింకేజీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

రెండు కేటగిరీలుగా..

గతంలో యూనిట్ ఆధారంగా రూ.2 లక్షలకు పైగా మూడు కేటగిరీల్లో బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేసేవారు. అయితే ప్రస్తుతం వీటిని రెండు కేటగిరీలకు పరిమితం చేసింది. కేటగిరీ–1లో 36 రకాల యూనిట్లు ఉన్నాయి. ఇందులో రూ.లక్ష వరకు రుణం మంజూరు చేస్తారు. 80 శాతం రాయితీ వర్తిస్తుంది. కేటగిరీ–2లో 16 రకాల యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కు రూ.2లక్షల వరకు రుణం మంజూరు చేస్తారు. ఇందులో 70శాతం రాయితీ వర్తిస్తుంది. మహిళలకు 33, దివ్యాంగులకు 5శాతం యూనిట్లు కేటాయించనున్నారు. కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

అర్హతలు ఇవే..

మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన ముస్లిం, సిక్కులు, పార్సీలు, బౌద్దులు, జైనులు, 21 నుంచి 55 ఏళ్ల వయస్సు వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారైతే రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఉండాలి. ఆన్‌లైన్‌లో https:// tsobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు రేషన్ కార్డు జతపర్చాలి.

ఉపాధికి రుణయోగం

మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు అందించనున్నారు. ఇందులో రెండు కేటగిరీలుగా విభజించారు. మొదటి కేటగిరీలో అత్తర్లు, సుర్మా తయారీ వ్యాపారం, బురఖా సేల్స్, ఫిజియోథెరపీ, బ్యూటీపార్లర్, వెల్డింగ్ షాప్, ఇళ్లలో తయారు చేసే స్వీట్లు, మసాలాల తయారీ, విక్రయాలు, బుక్ బైండింగ్, ప్రింటింగ్ ప్రెస్, టైలరింగ్, ఫర్నిచర్ తయారీ కేంద్రం, ఫ్లెక్సీ బ్యానర్లు, హోర్డింగ్ తయారీ, లేడీస్ ఎంపోరియం, పండ్లు, కూరగాయలు, కిరాణం, మ్యాచింగ్ సెంటర్, పాన్‌షాప్, కార్లు, ద్విచక్ర వాహనాల మరమ్మతుల కేంద్రం వంటివి. రెండో కేటగిరీలో ఎలక్ట్రీషియన్, ఏసీ మెకానిక్, స్టేషనరీ దుకాణం, ఆటో మొబైల్ విడిభాగాల విక్రయాల కేంద్రం, బేకరీ, ఫొటో వీడియోగ్రఫీ, మొబైల్ టిఫిన్ సెంటర్, చికెన్, మటన్ దుకాణాలు, ఆప్టికల్ దుకాణం. టెంట్ హౌస్, క్యాటరింగ్, సౌండ్ సిస్టం, సెంట్రింగ్, ఆర్‌సీసీ రూఫ్ మేకింగ్ యూనిటి వంటివి ఉన్నాయి. ప్రభుత్వం మైనార్టీలకు బ్యాంకు రుణాలు అందజేయాలని నిర్ణయించిందని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ మహ్మద్ తెలిపారు. మరిన్ని వివరాలకు 8500723745 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

56 యూనిట్లు మంజూరు

మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన వారిలో ఎక్కువ శాతం మంది నిరుపేదలే. కాగా స్వయం ఉపాధి పథకాల సద్వినియోగంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు వీలుంటుంది. ప్రస్తుతం రాయితీతో నిరుద్యోగులను ఆర్థికంగా ఆదుకునేందుకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయనుంది. జిల్లాకు 56 యూనిట్లను మంజూరు చేశారు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుండగా ఈ నెల 5వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనుంది. దీంతో నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు.

ఉత్పత్తి ఉత్పాదకతకు కృషి చేయాలి



ప్రమోషన్ ఆర్డర్ పత్రాలు అందిస్తున్న జీఎం

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎస్ఎల్‌పీ పదోన్నతులు పొందిన ఉద్యోగులు మరింత బాధ్యతతో పనిచేస్తూ ఏరియా ఉత్పత్తి ఉత్పాదకతకు కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మే నేజర్ దేవేందర్ అన్నారు. ఆదివారం ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో పలువురు ఉద్యోగుల కు సర్వీస్ లింక్డ్ ప్రమోషన్ ఆర్డర్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు కలిసి కట్టుగా పని చేసినప్పుడే ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని సునాయాసంగా సాధించగలమన్నారు. అనంతరం ఓసీపీ అధికారులతో కలిసి నూతన సంవత్సరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, ఏరియా ఇంజినీర్ తిరుమల్‌రావు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, ఇన్‌చార్జి మేనేజర్ రాజేశ్వర్‌రావు, టీబీజీకేఎస్ నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

12 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

జన్నారం: నూతన సంవత్సరం వేడుకలో భాగంగా మద్యం సేవించి రోడ్లపై తిరిగిన 12 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ ఆదివారం తెలిపారు. శనివారం సాయంత్రం 9 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. రెండు బృందాలుగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలపై తిరిగిన వారిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

చెరువులో దూకి ఆత్మహత్య


మొగిలి మృతదేహం

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని కుమ్మరి బొగుడ కాలనీకి చెందిన బజ్జూరి మొగిలి(48) కడుపు నొప్పి భరించలేక పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మొగిలి కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడిన నొప్పి తగ్గలేదు. మనస్తాపంతో ఆదివారం పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి తెలిపారు.

బాలిక ఆత్మహత్య


సువర్ణ(ఫైల్)

చింతలమానెపల్లి: కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడిన బాలిక ఆదివారం మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని బాబాసాగర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్సై యాదవ్ వివరాల ప్రకారం... సత్పుతే సువర్ణ (16) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నప్పటికీ నొప్పి తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తితో శుక్రవారం ఇంట్లోని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


బహుజన రాజ్యానికి కోటి సంతకాల సేకరణ


సంతకాల సేకరణలో నాయకులు

పాతమంచిర్యాల: బహుజన రాజ్యసాధన కోసం కోటిసంతకాల సేకరణ చేస్తున్నామని దళిత శక్తి ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ నందిపాటి రాజు అన్నారు. దళిత శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపకులు డాక్టర్ విశారదన్ మహరాజ్ బహుజన రాజ్యం సాధన కోసం పదివేల కిలోమీటర్ల పాదయాత్ర చేస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో కోటి సంతకాల సేకరణ ఆదివారం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ మొదటి సంతకం చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 3.20 కోట్ల మంది బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన వారున్నప్పటికీ వెల్మ, కమ్మ, రెడ్ల రాష్ట్రాన్ని 75 ఏళ్లుగా పాలిస్తున్నారని, 93శాతం ఉన్న బహుజనులు అధికారానికి దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాజ్య పాదయాత్ర చేస్తున్న విశారదన్ మహరాజ్ చేపట్టిన పాదయాత్రకు అన్ని వర్గాలవారు సంఘీభావం తెలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దళితశక్తి ప్రోగ్రాం జిల్లా కో కన్వీనర్ రామస్వామి, నాయకులు మోతే రాయలింగు, లింగంపల్లి ప్రేంరావు, నారాయణ పాల్గొన్నారు.


పల్లెవాతావరణంలో ఇల్లు, ఎద్దుల బండి..


అవుట్‌డోర్‌లో చూడముచ్చటగా ఇల్లు..



భలేగా.. ఇండోర్ స్టూడియో

మంచిర్యాలఅర్బన్: వివాహ వేడుక పవిత్ర బంధానికి వేదిక.. పెరిగిన సాంకేతికతతో మధురస్మృతులను పదిలంగా దాచుకోవటం సులువుగా మారింది. నేటి యువ జంటలు ఖర్చుకు వెనకాడకుండా వైజాగ్, హైదరాబాద్, బెంగుళూర్ వంటి ప్రాంతాలకు వెళ్లి సినిమాలకు తలదన్నేరీతినా ఫొటో, వీడియో షూట్ చేస్తున్నారు. ఇది గమనించిన ఓ యువతి ఆలోచనతో మంచిర్యాలలో మొట్ట మొదటి సారి ఇండోర్, అవుట్‌డోర్ స్టూడియో నిర్మితమవుతోంది. 31 సెట్లకుపైగా విభిన్నమైన సెట్లతో రూపుదిద్దుకుంటున్న స్టూడియో ఎంతో చూడముచ్చటగా కనువిందు చేస్తోంది.

స్టూడియో అదుర్స్..

ఆకట్టుకునే అలంకరణలు.. అదిరిపోయే సెట్టింగులు.. రాజమహల్‌ను మరిపించే దృశ్యాలు.. చూడగానే ఔరా అనిపించే ఎన్నో సెట్టింగులు.. ఇదివరకు హైదరాబాద్, బెంగుళూర్‌లాంటి నగరాలకే పరిమితం కాగా మంచిర్యాల గద్దెరాగిడి ఆర్ఆర్ నగర్‌లో రెండు ఎకరాలలో అలాంటి స్టూడియో అందుబాటులోకి రానుంది. కాకతీయ కళాతోరణాలు, గ్రామ్‌ఫోన్, రెడియో, వెదురుతట్ట, బుట్ట ఎన్నో కళా ఆకృతులు కనివిందు చేయనున్నాయి.


ఇండోర్‌లో రాజమహల్ సెట్టింగ్‌లో..


స్టూడియో నిర్మించిన పల్లెప్రాంత ఇల్లు..

గల్లీ to ట్రెడిషనల్ డ్యాన్సర్‌గా...

రాణిస్తున్న సంపత్‌కుమార్

చెన్నూర్: సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నాడు ట్రెడిషనల్ డ్యాన్స్‌మాస్టర్ సంపత్‌కుమార్. ఇంతింతై వటుడింతై అన్న చందంగా గల్లీలో డ్యాన్స్ ప్రాక్టీస్ చేసిన సంపత్‌కుమార్ నేడు వివిధ రాష్ట్రాలలో నృత్య ప్రదర్శలు ఇస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నాడు. ఇప్పటి వరకు 50కి పైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చిన సంపత్‌కుమార్ ఇటీవల అస్సాం రాష్ట్రంలోని జగర్తలాలో నృత్యం చేసి అక్కడి రాష్ట్రస్థాయి అధికారులతో మెమోంటోలతో పాటు ప్రశంస పత్రాన్ని అందుకున్నాడు.

- వివిధ రాష్ట్రాలలో ప్రోగ్రామ్స్
- జాతీయ స్థాయిలో 50కిపైగా నృత్య ప్రదర్శనలు


నృత్య ప్రదర్శనలో సంపత్‌కుమార్

ప్రస్థానం ఇలా..

చెన్నూర్ పట్టణం లైన్‌గడ్డ కాలనీలోని కృష్ణపల్లి రాజయ్యలీలా దంపతుల కుమారుడు సంపత్‌కుమార్‌ది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. డిగ్రీ వరకు విద్యాభ్యాసం చేసిన సంపత్‌కుమార్ 17వ ఏటా నుంచే డ్యాన్స్‌పై ఆకర్షితుడయ్యాడు. గురువుల వద్దకు వెళ్లి డ్యాన్స్ నేర్చుకునేందుకు ఆర్థిక స్థోమత లేక సంపత్‌కుమార్‌కు సినిమాలు, టీవీ షోలే గురువులయ్యాయి. అభిమాన హీరోల డ్యాన్స్‌లను చూసి అచ్చుగుద్దినట్లు డ్యాన్స్ చేసేవాడు. తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో సంపత్ నేడు సొంతంగా ఆదిలాబాద్ మథూరి ట్రెడిషనల్ డ్యాన్స్ గ్రూప్‌ను ఏర్పాటు చేశాడు.

230 మందికి పైగా శిక్షణ..

ఆర్థిక ఇబ్బందులతో ఎందరో సతమతమవుతున్నారు. డ్యాన్స్ నేర్చుకోవాలంటే డబ్బు అవసరం. ఈ విషయాన్ని స్వయంగా అనుభవించిన సంపత్‌కుమార్ 2017లో చెన్నూర్‌లో డ్యాన్స్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. అందులో సుమారుగా 100మందికి పైగా డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చాడు. చెన్నూరే కాకుండా ఆదిలాబాద్, హైదరాబాద్‌లలో డ్యాన్స్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చాడు. సుమారు 230 మందికి పైగా డ్యాన్స్ నేర్పించినట్లు సంపత్ తెలిపారు.

ఏడేళ్ల క్రితం డ్యాన్స్ గ్రూప్ ఏర్పాటు..

2015లో 15మంది సభ్యులతో ఆదిలాబాద్ ట్రెడిషనల్ డ్యాన్స్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏడేళ్ల కాలంలో 30కి పైగా డ్యాన్స్ ప్రోగ్రాంలను నిర్వహించారు. ఆయా రాష్ట్రాల నిర్వహకులు అందించే ఆర్థిక సహాయంతోనే గ్రూప్‌ను నడిపిస్తున్నట్లు సంపత్ పేర్కొన్నాడు. పక్క రాష్ట్రాలలో ట్రెడిషనల్ డ్యాన్స్‌కు మంచి ఆదరణ ఉందని సంపత్ తెలిపారు.

డ్యాన్సర్లుగా తయారు చేస్తా

"ఇప్పటి వరకు 230 మందికి పైగా డ్యాన్స్ నేర్పించా. మరికొంత మందిని తయారు చేయడమే నా లక్ష్యం. డ్యాన్స్ అంటే ఇష్టం ఉన్న వాళ్లు చాల మంది ఉన్నారు. డబ్బులు లేక డ్యాన్స్ నేర్చుకోలేక పోతున్నారు. నేను నిరుపేద కుటుంబం నుంచే వచ్చాను. ఆర్థిక కష్టాలు తెలుసు. డ్యాన్స్ అంటే ఇష్టం ఉన్న వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి మంచి డ్యాన్సర్లుగా తయారు చేస్తా. వచ్చే వేసవి కాలంలో డ్యాన్స్ శిబిరాన్ని ఏర్పాటు చేస్తా."

– కృష్ణపల్లి సంపత్‌కుమార్,
ట్రెడిషనల్ డ్యాన్సర్, చెన్నూర్.

జాతీయ స్థాయిలో 50కి పైగా ప్రదర్శనలు..

వివిధ రాష్ట్రాలలో అక్కడి సంప్రదాయ నృత్య ప్రదర్శనలు 50వరకు ఇచ్చాడు. ఎక్కడికి వెళ్లినా సంపత్‌కుమార్ డ్యాన్స్ చూసి మెచ్చని వారుండరంటే నమ్మశక్యం కాదు. ఎలాంటి నృత్య ప్రదర్శనైన అప్పటికప్పుడు ప్రేక్షులకు అనుగుణంగా చేయడంలో సంపత్‌కుమార్ దిట్ట. ఎన్నో అవార్డులు, ప్రశంస పత్రాలు, మెమోంటోలను సొంతం చేసుకున్నాడు.


అస్సాం రాష్ట్రంలో బహుమతి అందుకుంటున్న సంపత్‌కుమార్

భీమా కోరేగాం అమరుల స్ఫూర్తిని చాటాలి


అంబేద్కర్ విగ్రహం వద్ద అమరులకు నివాళి అర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: భీమా కోరేగాం అమరుల స్ఫూర్తిని చాటాలని దళిత బహుజన సంఘాల ఐక్య వేదిక నాయకులు పలిగిరి కనకరాజు, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం అన్నారు. ఆదివారం భీమాకోరేగాం అమరవీరుల శౌర్యదివస్‌ను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భీమా కోరేగాం అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అనైక్యత సృష్టిస్తున్న మనువాద వ్యవస్థ నిర్మూలనకు 205ఏళ్ల క్రితం పోరాటాలు చేసిన భీమా కోరేగాం అమరవీరులు చైతన్యంతో కులవ్యవస్థ నిర్మూలనకు ప్రజలు నడుం బిగించాలన్నారు. మెజార్టీ వర్గాలైన దళిత బహుజనుల హక్కుల కోసం ఉద్యమించాలని, మనువాదానికి మతోన్మాదానికి తావులేకుండా బీమా కోరేగాం పోరాట స్ఫూర్తిని ఆ తరువాత కాలంలో కొనసాగించిన అంబేద్కర్, జ్యోతిభాపూలేలు చూపిన బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు దేవి సత్యం, ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షులు గొడిశెల రాజారాం, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దేవి పోచన్న బహుజన ఉద్యమ నాయకులు తోట భూమన్న, మానవ వికాస వేదిక నాయకులు మడిశెట్టి సత్యనారాయణ, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎడ్ల కిష్టయ్య, సమత సైనిక్ దళ్ నాయకులు దుర్గం రామ్మూర్తి, ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీమన్నారాయణ, జైభారత్ అధ్యక్షులు సలీం, మున్సిపల్ కార్మికసంఘం నాయకులు జైపాల్‌సింగ్, దళిత విద్యార్థి సంఘం నాయకులు జుమ్మిడి గోపాల్, అడెపు సమ్మయ్య పాల్గొన్నారు.

అమరులకు నివాళి


అమరులకు నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

కాసిపేట: మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో ఆదివారం అంబేద్కర్ మండల యువజన సంఘం ఆధ్వర్యంలో భీమ కోరెగావ్ అమర వీరుల దినోత్సవం నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత దేశ చరిత్రలో భీమా కోరెగావ్ మహవీరుల యుద్ధం మరచిపోలేనిదన్నారు. అంబేద్కర్ మహవీరుల చరిత్రను చదివి కోరెగావ్ విజయస్థలం సందర్శించడం జరిగిందన్నారు. సంఘం మండల ఇన్‌చార్జి బన్న లక్ష్మణ్‌దాస్, సంఘం సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి గొడిసెల బాపు, సంఘం మండలాధ్యక్షుడు జాడి రాంచందర్, సలహాదారుడు పల్లె మల్లయ్య, నాయకులు గోడిసెల సురేందర్, బుగ్గ రాజు, అగ్గి సత్తయ్య, లంక లక్ష్మణ్, కరీం, బోగె లక్ష్మణ్, రత్నం రాజం, అజయ్, రాజేశం ఉన్నారు.

పదోన్నతుల షెడ్యూలు విడుదల చేయాలి

- ఎస్సీ, ఎస్టీ, టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న


సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

జన్నారం: ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవో 317 ప్రకారం నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు సంవత్సరాలుగా బదిలీలు లేకపోవడంతో ఒక్కో ఉపాధ్యాయుడు 8 నుంచి పది సంవత్సరాలు ఒకే పాఠశాలలో పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పదోన్నతులు లేకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. అదే విధంగా ఉపాధ్యాయుల రేషనలైజేషన్ లేకపోవడంతో ఎక్కువ విద్యార్థులున్న చోట ఉపాధ్యాయుల కొరత, విద్యార్థులు లేనిచోట ఎక్కువ ఉపాధ్యాయులు ఉండి విద్యావ్యవస్థ అస్తవ్యవస్థగా మారిందన్నారు. వెంటనే ప్రభుత్వం దృష్టి సారించి రేషనలైజేషన్, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి, 13 జిల్లాల స్పౌజ్ టీచర్లకు తగు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం టై, బెల్టు, బూట్లు అందజేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు తయారు చేయడాన్ని ఎస్సీ, ఎస్టీ, టీఎఫ్ హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ఒకే రోజు భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలు ఉండడంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉన్నందున వేరువేరుగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాంటెంకి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్య రాజన్న, ఉపాధ్యక్షుడు ముంజం మల్లేశ్, మండల అధ్యక్షుడు తుంగూరి గోపాల్ ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి


కేక్ కట్ చేస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా అందించే సంక్షేమ ఫలాలు గిరిజనులకు అందేలా చూడాలని అన్నారు. వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బంజారా రచయితల వేదిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీవో పీటీజీ భాస్కర్, ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు, జీసీసీ డీఎం రామానందం, హెచ్‌వో సుధీర్, డీపీవో ప్రవీణ్, ఏవో రాంబాబు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మామిడి పూతదశలో యాజమాన్యం

- నిర్లక్ష్యంతో తగ్గుతున్న దిగుబడి
- పూతదశ నుంచే చర్యలు చేపట్టాలి


పోలంపల్లిలోని పూతదశకి చేరుకున్న మామిడిచెట్టు

భీమారం: గత ఏడాది మామిడి దిగుబడులు అంతంత మాత్రమే వచ్చాయి. ధర అనుకున్న దానికన్నా అధికంగా రావడంతో రైతులకు కొంత ఊరటనిచ్చింది. ఈ నేపథ్యంలో ఈసారి వర్షాలు అధికంగా పడటంతో మామిడి పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది. మంచిర్యాల జిల్లాలో 18వేల ఎకరాల్లో రైతులు మామిడితోటలు సాగుచేస్తున్నారు. ఇప్పుడు పూత వస్తుందని ఇప్పటి నుంచే తోటలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే పూత ఆగి మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈ మేరకు పూత దశ నుంచి రైతులు తీసుకోవాల్సిన యాజమాన్యం పద్ధతులపై హర్టికల్చర్ అధికారి తిరుపతి వివరించారు. ఈసారి ఇప్పుడిప్పుడే మామిడి చెట్లకి పూత రావడం ప్రారంభమైంది. పూత దశలోనే చీడల నివారణకు మందుల పిచికారీకి అత్యధికంగా ఖర్చు చేస్తుంటారు.

మామిడిలో చేపట్టాల్సిన చర్యలు..

తోటల్లో తేలికగా దున్నడం, కలుపు మొక్కలు లేకుండా తోటలను శుభ్రంగా ఉంచడం చేయాలి. చెట్లకి పోషకాలను పిచకారీ చేయడం వల్ల పూత మొగ్గలను ఉత్తేజపరువచ్చు. ఇందుకోసం మల్టికె(13–0–45) ఎరువును లీటరుకు 10 గ్రాముల యూరియా లీటర్ నీటికి 5–10 గ్రాములు పిచికారీ చేయాలి.

చీడల నివారణ...

చెట్ల మొదల్లోని కలుపు మొక్కలు, చెత్తాచెదారాల్లో దాగి ఉన్న తేనె మంచు పురుగులు, పిండిపురుగులు చెట్ల కాండం, కొమ్మలపైకి ఎగబాకుతాయి. ఈ దశలోనే పురుగులను నివారించగలిగితే పూత సమయంలో వీటితాకిడిని తగ్గించవచ్చు. ఇందుకు జనవరి మొదటి వారంలో అసిపెట్ (లీటరుకి 1.5గ్రాము) లేదా రోగార్ (లీటరు నీటికి 2మి.లీ) మందుని నువాన్ (లీటరు నీటికి 0.5 మి.లీ) మందుతో కలిపి చెట్ల మొదళ్ల, కొమ్మలు బాగా తడిసేలా పిచికారీ చేయాలి.

లేత, పూత దశలోనే చీడల నివారణ...

మామిడి లేత పూత దశలో తేనె మంచు పురుగు, మిడ్జ్‌పురుగులు పూత మొగ్గలను తినే గొంగలి పురుగు, పేను, బూడిదతెగులు ఆశించి నష్టపరుస్తాయి. ఈ చీడల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ (లీటరు నీటికి 0.5 మి.లీటరు)లేదా దయేమిదాక్సి (లీటరు నీటికి 0.3 మి.లీ) లాన్సర్ గోల్డ్ (లీటరు నీటికి 2 గ్రాములు) ఎంపిక చేసుకున్న మందును నీటిలో కరిగే గంధకం (లీటరు నీటికి 3గ్రాములు) లేదా ప్రైడి మార్స్ (లీటరు నీటకి 1మీ.లీ) మందును కలిపి పూల మొగ్గలు బాగా తడిసేలా పిచికారీ చేయాలి.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

తాంసి: భార్య కాపురానికి రావడం లేదని పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలం నిపాని గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన మానేరు వెంకట్(30) కూలీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో గత కొన్నినెలలుగా మద్యానికి బానిసయ్యాడు. కూలీ పనులకు వెళ్లడం లేదు. దీంతో గత మూడు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన వెంకట్ శనివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. భీంపూర్ ఎస్సై రాధిక మృతదేహన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తల్లి అమ్మక్క ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు.